క్లుప్తంగా

మేడే కొత్త స్ఫూర్తిని నింపాలి



రాయచోటి : శ్రామికులు, కార్మికుల్లో మేడే కొత్త స్ఫూర్తిని నింపాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. కార్మికుల్లో చైతన్యం వెల్లివిరియాలన్నారు. ఆదివారం ఈ మేరకు రాయచోటిలో పత్రికలకు అందజేసిన ప్రకటనలో కార్మిక, కర్షక, శ్రామిక లోకానికి మేడే ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. శ్రమ దోపిడీని అరికట్టేందుకు ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలన్నారు. జగన్ ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు.

ప్రాథమిక పాఠశాలలు తనిఖీ

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె, కమ్మపాలెం గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశామని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థుల హాజరు రిజిస్టర్, మెనూ స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలో నాడు–నేడు ఫేజ్–2 కింద ఎంపికైన స్కూల్‌లలో మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. కావున మే 1వ తేదీ నుంచి ఆయా పాఠశాలల్లోని సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. లేని పక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేంకటేశ్వరుడికి వెండి తొడుగుల బహూకరణ



స్వామివారికి బహూకరించిన వెండి తొడుగులు

పెనగలూరు : మండల కేంద్రంలో వెలసి ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామికి శంఖు చక్రములతో కూడిన వెండి తొడుగులను భక్తులు బహూకరించినట్లు పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మలు తెలిపారు. వడ్డెర సంఘం కువైట్ అధ్యక్షుడు తురక వెంకటసుబ్బయ్య, పద్మా దంపతులు సుమారు రూ. 1.60 లక్షలు విలువజేసే వెండి హస్తములు, కర్ణపత్రములు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంబేపల్లె : మండల పరిధిలో వేర్వేరు ప్రాంతాలల్లో పేకాట ఆడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ షరీఫ్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సంబేపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడులు చేసి 7 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2230 స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా పాలెంగడ్డ సమీపంలో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.20,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

అవగాహన పోస్టర్ల ఏర్పాటు



యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కోసం ఏర్పాటు చేసిన పోస్టర్

సంబేపల్లె : యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాదర్‌రావు ఆదేశాల మేరకు ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ముఖ్య కూడళ్లలోను, పలు పాఠశాలల వద్ద ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల(డ్రగ్స్) వలన విద్యార్థులు, ప్రజల తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ యువతపై ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందన్నారు.

నల్లగంగమ్మ తిరునాలకు ఆహ్వానం



ధనుంజయరెడ్డి కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

సంబేపల్లె : మే నెల 5వ తేదీన జరుగనున్న శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లి తిరునాలలో పాల్గొనాలని సీఎం అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆదివారం రాయచోటి చెన్నముక్కపల్లెలోని ఆయన నివాసంలో కలిసి తిరునాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

శిల్పారామంలో వేసవి సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఈ సందర్భంగా పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. వేసవి సెలవులో శిల్పారామంలో కోలాహలం కనబడింది.

భువనగిరి నారసింహుడికి బ్రహ్మోత్సవ శోభ

- 3 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 5న ఘనంగా నిర్వహించనున్న కల్యాణం



భువనగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయం



లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్

రాజంపేట రూరల్ : భువనగిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను 3వ తేదీ నుంచి ప్రారంభమవ్వనున్నాయి. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న భువనగిరి శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలలో భక్తులు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. ఐదు రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో 6వ తేదీన నిర్వహించే కల్యాణం విశిష్టమైనది. జిల్లాలో ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు అందజేసే ఏకైక నరసింహస్వామి ఆలయంగా కీర్తించబడింది. ప్రతి సంవత్సరం స్వామివారికి భువనగిరి పల్లెలోని శ్రీకోదండరామస్వామి ఆలయం నుంచి కొండమీదికి మేళతాళాలతో బాజా భజంత్రీల నడుమ ముత్యాల తలంబ్రాలను తీసుకువస్తారు.

ఆలయ చరిత్ర

315 సంవత్సరాల క్రితం భువనగిరిపల్లె వద్దనున్న కొండపై ఒక వేపచెట్టు కింద శ్రీ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ మహావిష్ణువు పాదాలు ఉండేవి. వాటిని అక్కడికి వచ్చి గమనించిన ఒక సాధువు ప్రతిరోజు అక్కడే వుండి పూజలు నిర్వహిస్తూ ఉండేవాడు. కొండ కింద ఉన్న భువనగిరిపల్లె ప్రజలు గోవులను మేపుకునేందుకు కొండపైకి వెళ్లగా అక్కడ పూజలు చేసే సాధువు వారిని పిలిచి ఇక్కడ సాక్షాత్తూ శ్రీ లక్ష్మినరసింహస్వామివారి పాద ముద్రలు ఉన్నాయి అని తెలిపేవాడు. ఇక్కడ పూజలు నిర్వహించే వారికి ఆయన కోరిన కోర్కెలు తీరుస్తారని సెలవిచ్చేవారు. ఆ సాధువు పూజలు చేస్తూ క్రమేణా అదే పవిత్ర స్థలంలో శ్రీ లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్‌ను ప్రతిష్ఠింపచేసి ఆలయాన్ని నిర్మింపచేశారు.

స్వామిని దర్శించుకున్న అన్నమాచార్యులు

పదకవిత పితామహుడైన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు ఇక్కడి లక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్నట్టు ఇక్కడ పెద్దలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటూ ఉంటారు. అన్నమయ్య తన స్వగ్రామమైన తాళ్లపాక నుంచి అమ్మమ్మగారి ఊరైన (ఉడుమూరు)ఊటుకూరికి వెళ్లినపుడు అక్కడే సమీపాన ఉన్న భువనగిరి పల్లె కొండపైకి వెళ్లి స్వామివారి పాదాలను దర్శించుకునేవారట. అదే విధంగా అక్కడవున్న స్వామిని కీర్తిస్తూ కీర్తనలు కూడా రాశారని వారు తెలిపారు.

ఉత్సవ వివరాలు

3న గణపతి పూజ, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 4న గురువారం ఉదయం అభిషేకాలు, రాత్రి స్వామివారికి హనుమ వాహన సేవ నిర్వహిస్తారు. 5న శుక్రవారం ప్రత్యేక పూజలనంతరం రాత్రి స్వామివారికి గరుడసేవ నిర్వహిస్తారు. 6న శనివారం ఉదయం కల్యాణం జరుగనుంది. రాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. 7న వసంత సేవ, ధ్వజ అవరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ముగిసిన పాగేటి గంగమ్మ జాతర

సంబేపల్లె : మండల పరిదిలోని శెట్టిపల్లె పంచాయతీ గాండ్లపల్లె సమీపంలో వెలసిన పాగేటి గంగమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిససింది. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారికి మొక్కులు తీరిన భక్తులు బోనాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాత్రికి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



దర్శనమిస్తున్న పాగేటి గంగమ్మ

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



రాయచోటి టౌన్‌: ఆరాధనోత్సవంలో భక్తులు



చిట్వేలిలో ఆరాధనలో పాల్గొన్న మహిళలు

రాయచోటి టౌన్ : శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాయచోటిలోని బిజిలీ గుట్టపై వెలసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయంలో ఆరాధనను దువ్వూరి నరసింహాచారి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు నాగార్జునాచారి, ప్రధాన కార్యదర్శి నటరాజాచారి, రత్నమాచారి, మట్టి వెంకటరమణాచారి, సోమాచారి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవ సమాధి అయిన సందర్భంగా మండల పరిధిలోని మార్గోపల్లిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఆలయంలో అభిషేకాలు అన్నమయ్య కీర్తనలతోపాటు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని మేళతాళాల మధ్య గ్రామోత్సవం చేపట్టారు. మాజీ సర్పంచ్ మన్నూరు సుధీర్ రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామాపురం : మండల పరిషత్ సభా భవనంలో సోమవారం ఉదయం 10గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని మండలాధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ హైదర్‌వలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల గ్రామ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలియజేశారు.

గోవుకు అంత్యక్రియలు

రాజంపేట : గో రక్ష ప్రతి ఒక్క హిందువు బాధ్యత అని జిల్లా గోరక్ష సహ ప్రముఖ్ వర్ది బోయిన శ్రీధర్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఎల్ఐసీ ప్రధానకార్యాలయ సమీపంలో అనారోగ్యంతో మరణించిన చెందిన గోమాతను హిందు సంప్రాదాయపద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో గోసంరక్షణ సేవాసమితి ప్రతినిధులు తేజం రవిచంద్రప్రసాద్, బొజ్జా పెంచలయ్య, నాగినేని పెంచలయ్య , మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను శనివారం రాత్రి విడుదల చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పెద్దగుండాల్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నూరు శంకర్ రెడ్డిలతోపాటు కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పోస్టర్లను విడుదల చేశారు. మే నెల 4వ తేదీన స్వామివారి కల్యాణం జరుగనుందని వారు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



పూజలు చేస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : పెద్దకారంపల్లిలోని సీతారాముల ఆలయ పునర్నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఎన్ఆర్ఐ కేకే(కృష్ణ కుమార్‌రెడ్డి) రెడ్డి రూ.25 లక్షలు వెచ్చించి పనులను చేయిస్తున్నారు. పూజల్లో కేకేతోపాటు ఎంపీటీసీ ఎ.వరదరాజు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మిరియాల సురేఖ పాల్గొన్నారు. గ్రామంలో ఆధ్యాత్మికతను పెంచేందుకు కేకే చేస్తున్న కృషి గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు వెంకటసుబ్బారెడ్డి, సుభోద్‌రెడ్డి, శివరామిరెడ్డి, చొప్పా సుబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పూజలందుకున్న గంగమ్మ



గంగమ్మ సన్నిధిలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మను ఆదివారం అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, రామాపురం ఏపీఓ సురేంద్రనాథ్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఉపసర్పంచ్ రాజారెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ఈఓ ప్రవీణ్ రాజులు ఎంపీపీని దుశ్శాలువాతో సన్మానించారు.

నేడు మే డే ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : మే డేను పురస్కరించుకుని రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం తెలుగుగంగ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకటనలో తెలిపారు.

ఆధునిక సాహితీ యుగకర్త శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట : మండలంలోని పీవీజీపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కె.కృష్ణవేణి అధ్యక్షతన ఆదివారం ఉపాధ్యాయులు శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) 113వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ మాట్లాడుతూ శ్రీశ్రీ శ్రామికవర్గ చైతన్యమే ఊపిరిగా రచనలు రాశారన్నారు. విప్లవ కవిగా, పాటల రచయితగా, మహాకవిగా పేరొందిన శ్రీశ్రీ ఆధునిక సాహితీ యుగకర్త అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు రెడ్డిప్రసాద్, శివశంకరరాజు, సుజిత, భారతీ, శ్రీనివాసులు, చంద్రకుమార్‌లు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఘనంగా వాసవి మాత జయంతి



బుట్టలలో పుష్పాలను తీసుకెళుతున్న మహిళలు

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లెలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం వాసవి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మృత్యుంజయస్వామి ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్థానిక బస్టాండ్ కూడలి నుంచి అమ్మవారిశాల వరకు మహిళలు పుష్పాలతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వై.నరసింహాస్వామి, వైస్ ప్రెసిడెంట్ మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహాశెట్టి, మేడా వెంకటకుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు గెలివి జయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు అనిల్‌కుమార్, గెలివి లోకేష్, వల్లంకొండు చంద్రశేఖర్, శివ, నరసింహ, గోపిశెట్టి రఘు, గెలివి నరేష్, తులసిగిరి, దరిశ హేమంత్, భూపాల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన కిట్ల అందజేత



కిట్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, పోలా శ్రీనివాసులరెడ్డి తదితరులు

రాజంపేట రూరల్ : క్షత్రియులు సేవా హృదయులని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. స్థానిక ఇంటిగ్రేడ్ హస్టల్‌లో ఆదివారం క్షత్రియ సేవా సంఘం, క్షత్రియ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు భోజన సామగ్రి కిట్ (రెండు ప్లేట్‌లు, రెండు గ్లాస్‌లు, ఒక చెంబు)ను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డితో కలిసి విద్యార్థులకు భోజన సామగ్రి కిట్‌ను అందజేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ క్షత్రియుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం బి.లక్ష్మిదేవి, ఇంటిగ్రేడ్ హస్టల్ వార్డెన్ పి.శోభారాణి, క్షత్రియ సేవా సంఘం , క్షత్రియ కార్పొరేషన్‌ల ప్రతినిధులు డి.భాస్కర్‌రాజు, హెచ్‌వీ రాజు, డి.కరుణాకర్‌రాజు, ఎ.వరదరాజు, కె.శ్రీనివాసరాజు, కె.సూర్యనారాయణరాజు, కె.యల్లంరాజు, సుబ్బరామరాజు, సుబ్రమణ్యంరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ సుబ్బరామిరెడ్డి, దండు గోపీ, గోవిందు బాలకృష్ణ, బి.రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య పాల్గొన్నారు.

సిద్దవటంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం : ప్రజల ఆరోగ్యం తన బాధ్యతగా రాజంపేట నియోజకవర్గంలోని పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందిస్తామని కడప డయాగ్నస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ గాలివీటి వివేకానందరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ రామ్‌చరణ్, డాక్టర్ వై.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ షేక్ మహమ్మద్‌అలీ, ప్రతాప్ల జీర్ణకోశం, మెదడు, వెన్నుపూస, నరాలు, కిడ్నీలకు, జనరల్, షుగర్ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో లివిన్ డయాగ్నస్టిక్స్ మేనేజర్ సంపత్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన తాజా షెడ్యూల్‌ను విడుదల చేసి వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీను పూర్తి చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య, సివిప్రసాద్‌లు డిమాండ్ చేశారు. బదిలీలకు ప్రత్యేక కోడ్ తీసుకవచ్చి ప్రతి వేసవిలో బదిలీలు జరిగేటట్లు స్టాండర్డ్ షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. కోర్టులో ఉన్న బదిలీల సమస్యల్ని కూడా పరిశీలించి కొత్త మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. మార్గదర్శకాలు తయారు చేసే ముందు డ్రాఫ్టుకాపీని ఉపాధ్యాయ సంఘాల ముందు ఉంచి చర్చించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాభాపేక్ష లేని సమాజ సేవ



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : మానవత సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజ సేవ చేస్తోందని రాయచోటి సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మాజీ న్యాయమూర్తి రెడ్డి కుమార్ అన్నారు. ఆదివారం రాయచోటిలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమాజంలో పేదలకు సేవ చేయడంతోపాటు విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడం, సమాజ సేవపై మక్కువ పెంచడం, పర్యావరణాన్ని పరిరక్షించడానికి మొక్కలు నాటించడం వంటి కార్యక్రమాలు నేర్పుతోందన్నారు. అనంతరం ఉత్తమ రైతులకు, సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారికి ప్రతిభ పురస్కారాలు అందించారు. రాయచోటి మానవత స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు ఖాదర్ బాషా, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు వెంకటరమణ, జిల్లా డైరెక్టర్ ఆనందరెడ్డి, జిల్లా కన్వీనర్ వెంకట్రామిరెడ్డి (బాబు) తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాసకాలనీలో ఆదివారం గుంతకల్ రైల్వేబోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి వారి అనుమతితో ఇంటి గోడలపైన స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, ప్రజలకు ఇంకా ఏమి అందిస్తే బాగుంటుందని ప్రతి క్షణం ప్రజలు గురించి ఆలోచిస్తుంటారని, ప్రజాపక్షపాతి సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. కార్యక్రమంలో మంగంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

4న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

లక్కిరెడ్డిపల్లె : రాయచోటి – వేంపల్లి రహదారి మార్గంలోని రవీంద్రనగర్ వద్ద వెలసిన మర్రిచెట్టు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మే నెల 4వ తేదీన స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమంతోపాటు రాత్రివేళల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, సొసవల తిన్నమ్మకథ, చెక్కభజన, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా

సిద్దవటం : మండలం లోని వంతాటిపల్లె గ్రామంలో ఆదివారం జరిగిన గంగమ్మ జాతరకు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు శ్రీ నిత్యపూజస్వామి ఆలయ చైర్మన్ పాటూరి కొండారెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు ఏకుల రాజేశ్వరిరెడ్డి, సయ్యద్ జవహర్‌భాషా, బొగ్గిడివారిపల్లె ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఎల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌నూర్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, మండల ప్రతినిధి ఉపాసి వెంకటరమణారెడ్డి, మండల నాయకులు వావిళ్ల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెయిన్స్‌లో మెరిసిన గాలివీడు విద్యార్థి



అజయ్ కుమార్ రెడ్డి

గాలివీడు : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గాలివీడు మండల కేంద్రంలోని అరవీటివాండ్లపల్లెకు చెందిన వెలిగింటి కృష్ణకిషోర్ రెడ్డి, కామాక్షమ్మల కుమారుడు అజయ్ కుమార్‌రెడ్డి 514వ ర్యాంక్ (ఓపెన్ కేటగిరిలో) (ఈడబ్ల్యూఎస్ కోటాలో 40వ ర్యాంక్) సాధించాడు. అజయ్ కుమార్ రెడ్డి రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి. ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు మదనపల్లె వశిష్ట స్కూల్, ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు గుడివాడ విశ్వభారతి స్కూల్‌లో, ఇంటర్మీడియట్ విజయవాడ గాయత్రీ నగర్ శ్రీ చైతన్యలో అభ్యసన కొనసాగిస్తూ అద్భుతమైన ఫలితం సాధించినట్టు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

స్పెషల్ యాత్ర బస్సులు

పీలేరు రూరల్ : ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుపుతున్న స్పెషల్ యాత్ర బస్సులను పర్యాటకులు, భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కుమార్ కోరారు. ఆదివారం డిపో మార్కెటింగ్ టీమ్ కరపత్రాలు అందజేసి ఆర్టీసీ సర్వీసులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆమట్లాడుతూ పీలేరు నుంచి అరుణాచలం, భద్రాచలం, మున్నార్, ఊటి, కొడైకెనల్, మధురై, వేలంగిణి ప్రాంతాలకు ప్రత్యేక యాత్ర సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. మే 4న అరుణాచలంకు, 25న భద్రాచలంకు యాత్ర సర్వీసులు నడుతుపుతున్నట్లు తెలిపారు. భద్రాచలం టూర్ నాలుగు రోజులు ఉంటుందని, ఇందులో సీతమ్మ పర్ణశాల, రామయ్య తండ్రి నివాసము, జలపాతం, జూపార్క్, రాజమండ్రి గుంటిపోచమ్మ, బోటు ప్రయాణం, పాపికొండలు, షూటింగ్ ప్రాంతాలు సందర్శించే విధంగా ఉంటుందని తెలిపారు.

అలరించిన భక్తిగీతాల ఆలాపన

మదనపల్లె సిటీ: స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో ఆదివారం భక్తిగీతాల ఆలాపన అలరించింది. మన సృంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కళాకారులు 108 భక్తిగీతాలు ఆలపించారు. కళా సంస్థ అధ్యక్షులు రెడ్డప్ప మాట్లాడుతూ మారుమూల గ్రామాలోని ప్రజలు శ్రమైక జీవన సౌందర్యాన్ని పొందుతూ పాడుకున్న పాటలు రోజు రోజుకు కనుమరుగవుతున్నాయన్నారు. మన కళలు అంతరించిపోకుండా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు.